



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఉచిత ప్రయాణానికి.. సర్వం సిద్ధం..!



- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం
- ఆపై సర్వీసుల్లో, నాన్‌స్టాప్‌లలో టికెట్ తీసుకోవాల్సిందే
- జిల్లాలో 70 శాతం బస్సుల్లో జీరో టికెట్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

మహిళలకు ఈ నెల 15 నుంచి ఉచిత ప్రయాణం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేస్తోంది. స్త్రీ శక్తి పథకం పేరుతో ఉచిత ప్రయాణ మార్గదర్శకాలు జారీ చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ఆపై సర్వీసుల, నాన్‌స్టాప్‌లలో టికెట్ తీసుకోవాల్సిందే. జిల్లాలో ఉన్న బస్సుల్లో 70 శాతం బస్సుల్లో జీరో టికెట్లను జారీ చేయనున్నారు...

మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించే పథకానికి స్త్రీ శక్తిగా కూటమి ప్రభుత్వం నామకరణం చేసింది. తాజాగా ఆ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు, బాలికలకు, హిజ్రాలను ఈ ఉచిత బస్సు పథకాన్ని వర్తింపజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ 20 వేల మంది నుంచి 30 వేల మంది వరకూ మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వారికి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ఆపై సర్వీసులైన అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర, గరుడ, స్టార్ లైనర్ వంటి సర్వీసుల్లో ఈ ఉచిత ప్రయాణం వర్తించదు. అలాగే నాన్‌స్టాప్ బస్సు సర్వీసుల్లో ప్రయాణించాలంటే టికెట్ తీసుకోవాల్సిందే. జిల్లాలో ఉన్న బస్సుల్లో 70 శాతం బస్సుల్లో జీరో టికెట్లను జారీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 389 బస్సు సర్వీసులు ఉన్నాయి. వాటిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు కలిసి 187 సర్వీసులు, 84 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించనుంది. అంటే జిల్లాలో 271 బస్సు సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. వాటిలోనూ బళ్లారికి నడిచే 12 అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించదు.

ఆధార్ చూపిస్తేనే జీరో టికెట్..

బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ ఆధార్ కార్డును చూపిస్తేనే జీరో టికెట్ జారీ చేస్తారు. ఆధార్ కార్డు లేకుంటే డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాల్సి వస్తుంది. స్త్రీ శక్తి పథకం పేరుతో జీరో టికెట్‌ను జారీ చేయనున్నారు. అందులో టికెట్ ఛార్జీ మొత్తాన్ని చూపిస్తూ దాన్ని ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొంటూ చెల్లించాల్సిన మొత్తాన్ని రూ.సున్నాగా చూపించనున్నారు. ఆంధ్రప్రదేశ్ చిరునామా ఉన్న ఆధార్ కార్డులు చూపించిన వారినే ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తారు.

ఆ బస్సులపై రాని స్పష్టత

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వరకూ మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనే సింగిల్ స్టాప్, 2 స్టాప్ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై స్పష్టత ఇవ్వలేదు. ఉచిత ప్రయాణం వర్తించే బస్సుల వివరాలపై మహిళలకు అవగాహన కల్పించాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

ఉచిత బస్సులు ఇలా..

వీటిలో ఉచితం

పల్లె వెలుగు
అల్ట్రా పల్లె వెలుగు
ఎక్స్‌ప్రెస్

వీటిలో ఉచితం కాదు

నాన్‌స్టాప్
అంతర్ రాష్ట్ర సర్వీసులు
అల్ట్రా డీలక్స్
సూపర్ లగ్జరీ
స్టార్ లైనర్
ఎసి బస్సులు

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



దూర ప్రయాణం చేసేందుకు వీలుగా ఉండేందుకు సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణం కల్పించాలి. తిరుమలకు వెళ్లే సప్తగిరి సర్వీసుల్లోనూ ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలి. అమలు చేస్తున్నామనే పేరుతో కండీషన్‌లో లేని బస్సులు నడపకుండా మంచి బస్సులను నడపాలి. మహిళలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలి. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి. అలాగే బస్టాండ్లలో మహిళలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలి. ఈ పథకం వర్తించే బస్సుల గురించి మహిళలకు అవగాహన కల్పించాలి. ఉచిత బస్సుల్లోనూ మహిళలకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి.

- ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా కార్యదర్శి.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలి

- కలెక్టర్ రంజిత్ బాషా - 1.1 కిలోమీటర్ల పొడవు తిరంగా ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేసి ప్రతి ఒక్కరిలో దేశభక్తిని చాటి చెప్పాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాల నుండి కొండారెడ్డి బురుజు వరకు 2,800 మంది సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థులతో 1.1 కిలోమీటర్ల పొడవు గల మువ్వన్నెల జెండా ప్రదర్శన కార్యక్రమాన్ని కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... హర్ ఘర్ తిరంగా ప్రదర్శనలో భాగంగా నిర్వాహకులు గ్లోబల్ టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ ఖాజా మాలిక్, సెయింట్ జోసెఫ్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల సహకారంతో 1.1 కిలోమీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసేందుకు వరల్డ్ రికార్డ్స్‌అఫ్ ఇండియాకు చెందిన రిప్రజెంటేటివ్ వచ్చారని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శనలో మూడు, నాలుగేళ్ల వయస్సు గల పిల్లలు భారత మాత, సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, జవహర్ లాల్‌నెహ్రూ, స్వామి వివేకానంద, అల్లూరి సీతా రామ రాజు తదితర స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకర్షించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థుల నుండి జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. తిరంగా ప్రదర్శనలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఖాజా మాలిక్ (గ్లోబల్ టౌన్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్), పవన్ సోలంకి (వరల్డ్‌రికార్డ్స్ ఆఫ్‌ఇండియా రిప్రజెంటేటివ్), సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన డీన్(అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) శౌరీలురెడ్డి ప్రిన్సిపల్ శాంత, కళాశాల సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు, సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా నుంచి ముగ్గురికి నామినేటెడ్ పదవులు

- కార్పొరేషన్ ఛైర్మన్లుగా ప్రభాకర్, విక్రమ్ సింగ్, పార్వతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కూటమి ప్రభుత్వం మంగళవారం పలు నామినెటెడ్ పదవుల జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించింది. అందులో జిల్లా నుంచి ఆకెపోగు ప్రభాకర్, డి విక్రమ్ సింగ్, కమ్మరి పార్వతి పదవులు దక్కించుకున్నారు. ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కోడుమూరు నియోజకవర్గానికి చెందిన ఆకెపోగు ప్రభాకర్‌ను నియమించారు. బొందిలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కర్నూలు నియోజకవర్గానికి చెందిన డి విక్రమ్ సింగ్‌ను నియమించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పాణ్యం నియోజకవర్గానికి చెందిన కమ్మరి పార్వతిని నియమించారు.



ఆకెపోగు ప్రభాకర్



విక్రం సింగ్



పార్మతమ్మ

రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందచేశారు. అనంతరం పాఠశాలకు కాంపౌండ్ వాల్ కావాలని పాఠశాల సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డిఇఒను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాంతికళ, డిఇఒ శామ్యూల్ పాల్, హెడ్ మాస్టర్ మేరీ సునీత తదితరులు పాల్గొన్నారు..



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

అప్రజాస్వామికం..!

- విద్యాలయాల్లోకి అనుమతి నిరాకరణ
- సర్కార్ ఉత్తర్వులపై మండిపాటు
- నేడు విద్యార్థి సంఘాలు నిరసన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అ ప్రజాస్వామిక విధానాలను అమలు చేసేందుకు పూనుకుంటుంది. పాఠశాలలు ఇతర విద్యాలయాల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులు మినహాయించి ఇతరులు ఎవరు వెళ్ళరాదని ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో జారీ చేసిన ఉత్తర్వుల పట్ల ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో మరియు ఇతర విద్యాలయాల్లో ఇతరులు లోపలికి వెళ్లి కుండా నివారించేందుకు తీసుకువచ్చినటువంటి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యారంగం మొత్తం కార్పొరేట్ ప్రైవేటు సంస్థల చేతుల్లోనే సింహభాగం ఉంది. ఈ సంస్థలకు చెందిన విద్యాలయాల్లో విపరీతమైన ఫీజులతో ,విద్యార్థులపై బోధన పేరుతో ఒత్తిడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. సదరు విద్యాలయాల్లో ఎక్కువగా విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పుడు అలాంటి ఘటనలను ఖండించేందుకు వెళ్లే విద్యార్థి, ఇతర ప్రజా సంఘాలను నిలువరించేం దుకు అవకాశం లేకుండా ఉత్తర్వులను తీసుకువచ్చారు. సదరు ఉత్తర్వుల అమలు వల్ల కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టేందుకు లేకుండా పోతుంది. ప్రభుత్వ విద్యాలయాల్లో కూడా నెలకొన్న సమస్యలను అటు ప్రభుత్వం దృష్టికి, ఉన్నత అధికారుల దష్టికి తీసుకు వెళ్లేందుకు లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందో లేదో కూడా పరిశీలన చేసేందుకు లేకుండా ఈ ఉత్తరులను అడ్డంకిగా తీసుకువచ్చారు. ఇటువంటి ప్రజాస్వామిక ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు , ప్రజా సంఘాలు ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తర్వులను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదు

- రంగప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎఫ్‌ఐ



కూటమి ప్రభుత్వం విద్యాలయాల్లోకి అన్యులను ఎవరినీ అనుమతించకుండా తీసుకొచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి. ఈ ఉత్తర్వులను రద్దు చేసినందుకు పోరాటం విరమించేది లేదు.

అసంబద్ధ ఉత్తర్వులను రద్దు చేయాలి

- షాబీర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎఐఎస్‌ఎఫ్



ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం లేదా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రస్తుతం జారీ చేసిన ఉత్తర్వులు ఆటంకంగా మారాయి. ఈ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియకుంటే పరిష్కారం కావు. అసంబద్ధ ఉత్తరులను వెంటనే రద్దు చేయాలి.

93.67శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు

డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి. శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు జిల్లాలో మంగళవారం నిర్వహించిన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో 6,54,840 మంది పిల్లలకు గాను 6,13,388 అంటే 93.67శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి. శాంతి కళ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన పిల్లలకు ఈనెల 20న మా అప్ రౌండ్ లో మాత్రలు వేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో...

కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరంలోని బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల లో మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని 500 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నిర్మల , ఆశా వర్కర్ స్వప్న , కళాశాల లెక్చరర్స్ సుజాత, విజయశేఖర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



మద్దికేర: జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మద్దికేర మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒకటి నుంచి 19 సంవత్సరంల లోపు పిల్లలకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ 400 ఎం.జి మాత్రలను పంపిణీ చేశారు. మద్దికర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాగిణి మాట్లాడుతూ నులి పురుగులను నిర్మూలించాలని, నులి పురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక మానసిక లోపాలతో ఉంటారన్నారు. పిల్లలకు నులిపురుగులు రాకుండా వారానికి ఒకసారి గోళ్లను కత్తిరించుకోవాలని ,ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని తాగాలన్నారు.

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండల రెవిన్యూ ఆఫీసర్ బి నాగరాజు, కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న, డాక్టర్ మదన్ శేఖర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామచంద్రుడు తో కలిసి జి వి ఆర్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడుమూరులో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ఆల్బెండజోల్ -400 ఎంజి మాత్రలు పంపిణీ చేశారు.

ఘనంగా ఎంఆర్‌పిఎస్ జెండావిష్కరణ

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్‌లో , బురాన్ దొడ్డిలో ఎంఆర్‌పిఎస్ 31వ జెండావిష్కరణను ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్రబోష్, ఎమ్మార్పిస్ జిల్లా అధ్యక్షులు రెడ్డి పోగు భాస్కర్, ఎంఎస్పి జిల్లా నాయకులు మణిరాజు లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో మండల నాయకులు, లక్ష్మన్న, నాగరాజు, చంద్ర శేఖర్,తిమ్మన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.. ఇక్కడే ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మార్పిస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఉద్యమ తలంపు స్థిరమైనదని వారు పేర్కొన్నారు. అలాగే వర్గీకరణ సాధించుకున్నామని, పూలే, జగజ్జీవన్ రామ్, అంబేద్కర్ ల ఆశయాలు కొన్ని నిలిచి పోయాయని, ఐక్య పోరాటాలకు మాదిగలు సిద్ధం కావాలని కోరారు.

పిఆర్‌సి ప్రకటించకపోతే ఉద్యమం

-ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి-కార్యవర్గంలోకి యువకులకు చోటు
-వెంగల్ రెడ్డి సేవలు ఎనలేనివి -ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్
-వెంగల్ రెడ్డిని సత్కరించిన ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



వెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

12వ పిఆర్‌సి కమిషన్ ప్రకటించకపోతే ఉద్యమం చేపడతామని ఎపిఎన్‌జిఒఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలని పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు బిర్లాగే సమీపంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాలులో ఎపిఎన్‌ఒ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంగల్ రెడ్డి ఆత్మీయ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బివి రమణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఎపి ప్రభుత్వ వాహన డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఎపిఎన్‌జిఒకర్నూల్ నగర అధ్యక్షుడు కాశన్న, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ. మద్దిలేటి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం వెంగళ్‌రెడ్డిని సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్‌లో బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ ల సమస్యల పరిష్కారానికి వెంగల్ రెడ్డి కృషి చేశారని కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ చెందిన అసోసియేషన్‌కు సేవలు అందించాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి జెఎసి కూడా కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నుండి తాలూకా స్థాయి వరకు జెఎసిని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగులకు ప్రకటించాల్సినవి, ఇవ్వాల్సినవి వెంటనే ఇవ్వాలన్నారు. ఇటీవల సీఎం ఆర్థిక మంత్రి సిఎస్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. ఎన్‌జిఒ కార్యవర్గంలోకి తాలూకా స్థాయి నుండే 30శాతం పదవులను యువకులకే కేటాయించాలని కోరారు. జిల్లా కార్యవర్గాలు మరింత పటిష్టంగా పనిచేసేందుకు దృష్టి సారించామన్నారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా ఎన్‌జిఒ సంఘం వైపు చూసేలా ప్రతి నాయకుడు కార్యకర్త పని చేయాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులను భాగస్వామ్యం చేసేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ మాట్లాడుతూ వెంగల్ రెడ్డి చేసిన సేవలను ఎన్‌జిఒ సంఘం మరువలేనిదని పేర్కొన్నారు. ఉద్యోగులు సంఘటితంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని కోరారు. వెంగల్ రెడ్డి మాట్లాడుతూ తన ఉద్యోగ ప్రస్థానంలో సగంజీవితం ఎన్‌జిఒ అసోసియేషన్‌కు అంకితం చేశానన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు . ఈ సందర్భంగా వెంగళ్‌రెడ్డి దంపతులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఘనంగా శాలువా మెమెంటో లతోసన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

-సెప్టెంబర్ 15న భవన నిర్మాణ కార్మికుల లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి
-రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ నరసింహులు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని , సెప్టెంబర్ 15న విజయవాడ లేబర్ కమిషన్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఎపి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.నరసింహులు కోరారు. కర్నూల్ నగరంలోని శరీన్ నగర్ మట్టి పని అడ్డా మేస్త్రీల జనరల్ బాడీ సమావేశం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో సిఐటియు నగర నాయకులు జి.ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఆర్.నరసింహులు, జిల్లా నాయకులు కె సుధాకరప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పనులు లేక రోజు అడ్డాల దగ్గరకు చద్దులు కట్టుకొని వచ్చి ఎవరు పనికి పిలుస్తారా అని ఎదురుచూస్తూ ఎవ్వరు పనికి పిలవకపోతే తిరిగి ఇంటికి వెళ్లవలసిన పరిస్థితి ఉన్నదని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు పెట్రోలు, డీజిల్, గ్యాస్ కరెంటు చార్జీలు బస్ చార్జీలు రైలు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు నిలిచి ఉండే అడ్డాలలో కార్మికుల సౌకర్యార్థం షెడ్లు నిర్మించి తాగునీరు, టాయిలెట్స్ ఏర్పాటుచేయాలన్నారు. సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని చెప్పి కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం మెడలు వంచడం కోసం సెప్టెంబర్ 15న విజయవాడలో లేబర్ కమిషనర్ ఆఫీసు ముట్టడిని చేపట్టబోతున్నామని అన్నారు. లేబర్ కమిషనర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మట్టి పని మేస్త్రీల సంఘం కార్యదర్శి ఎం జె ఈశ్వరమ్మ, అధ్యక్షులు ఎం దాసున్న, శ్రీనివాసులు, శ్రీను, మరియమ్మ, ఎల్లమ్మ సరోజమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఆర్ నరసింహులు

బిఎస్‌ఎన్‌ఎల్ ఉచిత 4 జి సిమ్ మెగా మేళా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్‌ఎన్‌ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా పరిధిలోని అన్ని బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసుల వద్ద గురువారం14న ఉచిత 4జి సిమ్ మెగా మేళా నిర్వహిస్తామని కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు , నంద్యాల జిల్లాలోని అన్ని మొబైల్ టవర్లను 4 జి టవర్లుగా మార్చామని తెలుపుతూ స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ ఆగస్టు నెలలో బిఎస్‌ఎన్‌ఎల్ ఫ్రీడం ప్లాన్‌ను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ ఆఫర్ కింద కేవలం రూ.1కే , 30 రోజులు పాటు ప్రతిరోజు 2 జిబి డేటా, అపరిమితమైన కాల్స్ , 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చని తెలిపారు. ఇతర ఆపరేటర్ నుండి బిఎస్‌ఎన్‌ఎల్‌కు పోర్ట్ అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందన్నారు. ఈ ఆఫర్ ఆగస్టు 31 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. వినియోగదారులు దగ్గరలో ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులను, సేవా కేంద్రాలనును లేదా రిటైలర్ ను సందర్శించి ఈ ఉచిత ఆఫర్ను పొందాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారంకోసం పోరాటం

మండల మహాసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ స్వామి

ప్రజాశక్తి-పత్తికొండ

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికుల ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి భవన్‌లో సిఐటియు మూడవ మండల మహాసభలు హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. నారాయణస్వామి, సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాల రాస్తే సహించేది లేదని అన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న 44 లేబర్ కోడ్లు ను రద్దుచేసి , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు బలపడాలంటే కార్మిక సంఘాల ఐక్యం కావాలన్నారు. సిఐటియు మాజీ నాయకులు దస్తగిరి,సిద్దయ్య గౌడ్, రంగారెడ్డి, పిఎన్ఎం జిల్లా నాయకులు పెద్ద కాశన్న, రమేష్, మద్దికేర మండలం సిఐటియు నాయకులు రాముడు, డివైఎఫ్ఐ దుగ్గెన్న, జయప్రకాశ్ రెడ్డి, అల్లిపిర, పుచ్చకాయల మాడ రైతు సంఘం ఆదినారాయణ, కార్పెంటర్ యూనియన్ నాయకులు హుస్సేన్ సాహెబ్, కాశీనాథ పాల్గొన్నారు.

పత్తికొండ సిఐటియు నూతన మండల కమిటీ ఎన్నిక...

సిఐటియు కన్వీనర్‌గా ఎం. రవిచంద్ర కో- కన్వీనర్ గా గోపాల్, కోశాధికారిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా నరసన్న, కార్య వర్గ సభ్యులుగా లక్ష్మి, అంజనమ్మ, శ్రీనివాసులు, రామాంజనేయులు, పావని, ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులుగా ఉరుకుంద, సావిత్రిబాయి, శ్రీనివాసులు, మోహన్, దుగ్గెన్న, హుస్సేన్, నడిపి రంగన్న, నాగేంద్ర, సురేంద్ర పాటు పదిమందిని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి


పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

యూరియా కోసం రైతుల ఆందోళన

- రైతులపై అధికారి చిందులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని రైతులు 20 రోజుల నుంచి యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ అధికారులు రైతుల నుంచి డబ్బులు తీసుకొని, టోకెన్లు ఇచ్చారు. మరికొంతమంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను చూసి టోకెన్లు ఇచ్చారు. టోకెన్లు ఇచ్చి 20 రోజులకు పైగా అయినా రైతులకు యూరియా అందలేదు. దీంతో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. యూరియా అందేవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించారు. వందలాదిమంది రైతులు యూరియా కోసం రావడంతో ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాకపోకలు స్తంభించిపోయాయి. మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా వ్యవసాయ అధికారులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు అలాగే రోడ్డుపై కూర్చున్నారు.

రోడ్డుపై కూర్చుంటే యూరియా వస్తుందా..! : ఎఒ శేషాద్రి

ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు ఎఒ శేషాద్రి వచ్చి 'రోడ్డుపై వచ్చి కూర్చుంటే యూరియా వస్తుందా' అని చిందులు వేశారు. మరో రైతుతో 'నీకు టోకెన్ ఎవరు ఇచ్చారు..? ఆ టోకెన్ ఎవరు రాశారు..?' అని ఆ రైతు నుంచి టోకెన్ తీసుకొని చింపేయడంతో ఆ రైతు అధికారిపై మండిపడ్డారు. రైతులు ఆగ్రహంతో వ్యవసాయ అధికారిని నిలదీశారు. ఉదయం నుంచి యూరియా కోసం ఇక్కడ కూర్చుంటే 'మీరు చెప్పే సమాధానం ఇదేనా' అంటూ ప్రశ్నించారు. 23 రోజుల క్రితం 1200 బస్తాలకు టోకెన్లు రైతులకు ఇచ్చారు. కేవలం 560 బస్తాలు మాత్రమే స్టాక్ ఉండడంతో టోకెన్లు తీసుకున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం వందల సంఖ్యలో రైతులు తరలి రావడంతో వ్యవసాయ అధికారులు రైతుకు రెండు, మూడు బస్తాలు అందిస్తామని చెప్పారు. పెద్ద పెద్ద రైతులకు 50, 100 బస్తాలు అందిస్తున్న అధికారులు చిన్న రైతులకు రెండు బస్తాలు అందిస్తామని చెప్పడం తగదని అధికారితో వాగ్వాదానికి దిగారు. రెండు రోజుల్లో వ్యాగన్ వస్తుందని, మరికొన్ని లోడ్ల యూరియాను తెప్పించి అందరికీ అందిస్తామని చెప్పి వ్యవసాయ అధికారి వెళ్లిపోయారు.

నిందలు వేస్తున్నారు... : రైతులు గురుస్వామి, రాముడు

యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులను 'మద్యం తాగి వచ్చి ధర్నా చేస్తారా' అంటూ ఎఒ శేషాద్రి రైతులపై నిందలు వేస్తున్నారని రైతు గురుస్వామి, రాముడు వాపోయారు. రైతులకు యూరియాను అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రైతులపైనే ఇలా తాగుబోతులని నిందలు వేయడం తగదన్నారు.

టోకెన్ చించి వేసిన అధికారిపై తీసుకోవాలి : రైతు బసవరాజు

రైతులంటే వ్యవసాయ అధికారికి అంత నిర్లక్ష్యమా అని రైతు పల్లెద బసవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం టోకెన్లు ఇచ్చింది వ్యవసాయ అధికారులు, వారే టోకెన్లు చింపి వేస్తే నా పరిస్థితి ఏమిటని ఆ రైతు ప్రశ్నించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత డొల్ల

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బైపాస్ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. ఆలూరు రోడ్డు నుంచి పత్తికొండ రోడ్డు వరకు నిర్మిస్తున్న ఆదోని బైపాస్ రోడ్డు జగనన్న కాలనీకి వెళ్లే దారిలో నాణ్యత సరిగా లేక కుంగి పోయిందని, దీనికి హైవే అథారిటీ అధికారులదే ప్రధాన బాధ్యత అని తెలిపారు. కుంగిన రోడ్డును సిపిఎం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణం జరుగుతున్న పర్యవేక్షణ లోపం కనబడుతోందని విమర్శించారు. నిర్మాణం పూర్తికాకముందే అక్కడక్కడ రోడ్డు కుంగిపోయిందని, కలెక్టర్ జోక్యం చేసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.గోపాల్, పట్టణ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

భక్తుల సౌకర్యాలు, సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తుల సౌకర్యాలు, సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. మంగళవారం శ్రీరాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా ఉత్తరారాధన సందర్భంగా మహారథంపై ఆయన మాట్లాడారు. దేశ నలుమూలల నుంచి రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండంతో భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.

భక్తజన సందోహం మధ్య మహా రథోత్సవం

మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం భక్త జన సందోహం మధ్య వైభవంగా సాగింది. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారం నుంచి వివిధ కళాకారుల వాయిద్య బృందాలతో, భక్తుల కేరింతలతో కొయ్యరథంలో ఉంచి ఊరేగించారు. శ్రీమఠం ఆవరణలోని శ్రీమధ్వ మార్గ కారిడారు నుంచి శ్రీరామ సర్కిల్, రాఘవేంద్ర సర్కిల్ మీదుగా రథోత్సవం నిర్వహించి మళ్లీ శ్రీమఠం ఆవరణంలోకి చేరుకుంది. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు హెలికాప్టర్ ద్వారా రథంపై పుష్ప వర్షం కురిపించారు. డ్రోన్ కెమెరా ద్వారా రంగురంగుల కాగితాలు రథంపై కురిపించడంతో భక్తులు ఆనందంతో కేరింతలు వేశారు.

వైభవంగా ప్రహ్లాద రాయుల వసంతోత్సవం

శ్రీమఠం వద్ద ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వసంతోత్సవం నిర్వహించారు. స్వామి వారి మహా రథోత్సవంతో సందర్భంగా ప్రహ్లాద రాయులకు విశేష పూజలు చేపట్టి, రంగులు వేసి ఆనందోత్సాహంతో వసంతోత్సవం చేపట్టారు. పీఠాధిపతులు, ఆయన పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, అల్లుడు కృష్ణ కౌశిక్ అందరిపై రంగులు వేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

రథోత్సవంలో టిడిపి ప్రముఖులు

శ్రీరాఘవేంద్రస్వామి మహా రథోత్సవంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తమ గ్రూపులతో హాజరయ్యారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. మహారథం వద్ద ఇరువైపులా తమ గ్రూపు నాయకులతో నిలిచారు. గుమ్మడికాయను తిక్కారెడ్డి చేతికిచ్చి పీఠాధిపతులు దిష్టి తీయించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, హండే అనుమంతు, వనికె నాగ రాజు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ, సాతనూరు ఉలిగయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు, టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, సింగిల్ విండో డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, మద్రి శివ పాల్గొన్నారు.

సర్పంచికి పీఠాధిపతుల ప్రశంస

ఆరాధన సందర్భంగా మంత్రాలయంలో స్వచ్ఛత ఉంచడంలో సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, ఇతర సిబ్బంది చేపట్టిన చర్యలను పీఠాధిపతులు ప్రశంసించారు.

భారీ భద్రతతో పోలీసు బలగాల నిఘా

భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పోలీసు బలగాలు నిఘా ఉంచారు. శ్రీమఠంలో జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో డీఎస్పీ భార్గవి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో భక్తులకు భద్రత ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. సుమారు 300 మంది పోలీసులు, శ్రీమఠం, భక్తుల సేవకు ఉపయోగించారు.


భక్తజన సందోహం మధ్య మహా రథోత్సవం


ఆలయ ప్రాంగణంలో ఉన్న టిడిపి నాయకులు

నాన్ లేఅవుట్లను అరికడదాం

- కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆదోని

నాన్ లేఅవుట్లను అరికట్టి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో కుడా ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రణాళిక, అభివృద్ధి నియమాలు, భవన నిర్మాణ అనుమతులు, పర్యావరణ పరిరక్షణ, శానిటేషన్, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం వల్ల ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల మధ్య సమన్వయం కలిగించి మౌలిక వసతులను మెరుగుపరచడం, అక్రమ నిర్మాణాలను అరికట్టడం, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో చురుకైన పాత్ర వహించాలని ఆదేశించారు. డిఎల్‌పిఒ తిమ్మక్క, ప్లానింగ్ ఆఫీసర్లు విజయ భాస్కర్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి

ఈరన్న సన్నిధిలో ఎస్పీ

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ దర్శించుకుని, పూజలు నిర్వహించారు. మంగళవారం ఆయన దేవాలయానికి చేరుకోగా దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. డిప్యూటీ కమిషనర్ వాణి, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ ఉన్నారు.

రికార్డుల పరిశీలన : కౌతాళం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సిఐ అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములిచ్చేది లేదు

- మనేకుర్తి గ్రామ రైతులు

ప్రజాశక్తి - ఆలూరు

పవర్ గ్రిడ్ నిర్మాణానికి సాగు భూములు ఇచ్చేది లేదని రైతులు, రైతుసంఘం నాయకులు తెగేసి చెప్పారు. మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న 190 ఎకరాల్లో పవర్ గ్రిడ్ నిర్మాణానికి భూసేకరణ కోసం మంగళవారం తహశీల్దార్ శోభ సువర్ణ ఆధ్వర్యంలో మండలంలోని మనేకుర్తి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న, గ్రామ రైతులు ఎం.నాగరాజు, వెంకటేష్, దేవన్న, బెంచెప్పగారి చిన్న ఆంజినేయలు తహశీల్దార్ శోభ సువర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగా మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ నిర్మాణానికి ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.18 లక్షలు ఇస్తుందని తెలిపారు. ఇవ్వకపోతే కోర్టుకెళితే రూ.6 లక్షలు ఇస్తుందని చెప్పారు. రైతులు సహకరించాలని కోరుతూనే మరో పక్క భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రైతు సంఘం నాయకులు, రైతులు మాట్లాడుతూ... గ్రామంలోని ప్రజలందరూ పంట భూములపై అధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల పంటలకు సాగు నీరు అందించమంటే ఉన్న భూములను పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు భూములను అప్పజెప్పడం ఏమిటని ప్రశ్నించారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కంపెనీ గత కొన్నిరోజులుగా మంతనాలు చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేసేందుకు లాయర్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. తమ జీవనాధారమైన పంట పొలాలకు ఎన్ని రూ.లక్షలు ఇచ్చినా ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. తహశీల్దార్ మాట్లాడుతూ... రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని, వారి అభిప్రాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ బసన్న గౌడ్, పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మూర్తి, సర్పంచి కొల్లమ్మ, రైతులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

నేడు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల హక్కులను హరించే ఉత్తర్వులను రద్దు చేయాలని బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేపడుతున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యాసంస్థల ఆవరణలోకి విద్యార్థి సంఘాల అనుమతిని నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని పట్టణంలోని భగత్ సింగ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహా కార్యదర్శి దస్తగిరి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, జిల్లా కోశాధికారి సోమశేఖర్, పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్, ఆర్‌పిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు మాట్లాడారు. విద్యార్థుల హక్కులను కాలరాసే విధంగా ఉత్తర్వులు ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు, విద్యార్థి సంఘాలకు వ్యత్యాసం ఉందని, రెండింటినీ ఒకే గాటిన కట్టడం మంచిది కాదని తెలిపారు. మంత్రి నారా లోకేష్ విద్యార్థి సంఘాలను పిలిచి సమస్యలను విని 'మీరు గట్టిగా పోరాడండి' అంటూ అందరినీ ప్రోత్సహించారని, అధికారంలోకి వచ్చాక విద్యార్థి సంఘాలపై ఇలాంటి నిబంధనలు విధించడం సిగ్గుచేటని విమర్శించారు. ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, పిడిఎస్ఒ జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర బాబు, పిడిఎస్‌యు రవి, ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు ఖాదర్, ఎన్ఎస్‌యుఐ తాలూకా అధ్యక్షులు రంగస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు నరసింహ రెడ్డి, ఇమ్రాన్, రాజు, జనార్ధన్ పాల్గొన్నారు.


ఆదోనిలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - ఆదోని రూరల్



శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం పెద్దతుంబళం పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం రికార్డులను, రికార్డుల గదిని, ఫిర్యాదుల విభాగాన్ని పరిశీలించారు. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మోడల్ పాఠశాలలో 'అటల్ టింకరింగ్ డే'

ప్రజాశక్తి - గోనెగండ్ల


వాక్యూమ్ క్లీనర్ తయారు చేస్తున్న విద్యార్థులు

ఎపి మోడల్ పాఠశాలలో 'అటల్ టింకరింగ్ డే'ను ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, ల్యాబ్ ఇన్‌ఛార్జీ దేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధునిక మేకర్ స్పేస్‌లని, వీటి ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక అంశాల పట్ల ఆసక్తి, సృజనాత్మకతను రూపొందించవచ్చని తెలిపారు. వీటి ద్వారా 3డి ప్రింటర్లు, ఎల్ఒటి కిట్లు, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ లాంటి సాంకేతిక పరికరాలను విద్యార్థులు స్వయంగా ఉపయోగించే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులు జూమ్ లింకు ద్వారా స్వయంగా వ్యాక్యూమ్ క్లీనర్‌ను తయారు చేసినట్లు తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ విజయ్, మెంటర్ మహ్మద్ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యకరమైన జీవనశైలితోనే నులిపురుగులను నివారించవచ్చని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. సబ్ కలెక్టర్ హాజరై విద్యార్థులకు మాత్రలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లల్లో శుభ్రత, పరిశుభ్రత అలవాట్లు పెంపొందించడంతో పాటు సక్రమమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో ఆరోగ్యంపై జాగృతి తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ రంగనాథరావు, జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ షాహినాజ్ బేగం, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, హెచ్ఎం ఫయాజ్, డిపిఎంఒ సీతారాముడు, మేరీ అరుణ, జ్ఞానేశ్వర్, మధు పాల్గొన్నారు. **చిప్పగిరి** చిప్పగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి అఫ్రోజ్ జహాన్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడారు. 2–19 ఏళ్లలోపు పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. కడుపులో నులిపురుగులుంటే రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఈ సమస్యలు ఉండవన్నారు. ఎఎన్ఎం శాంత కుమారి పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దహరివాణం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఇమ్రాన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఎంపిహెచ్ఇఒ లక్ష్మీనారాయణ, ఎఎన్ఎం పుష్పలత, పిఇటి రామన్న, ఉపాధ్యాయులు చిరంజీవి పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు మండల ప్రాథమిక వైద్యాధికారి విజయభాస్కర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈదులదేవర బండ ప్రాథమిక పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నులిపురుగు మందుల పంపిణీని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ భాస్కర్, కడప రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్య పరిశీలించారు.


ఆదోనిలో మాత్ర తినిపిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


చిప్పగిరిలో మందులు వేస్తున్న అఫ్రోజ్ జహాన్


దేవనకొండలో...

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల నష్టం జరిగే ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఎపి ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం ఈనెల 15 నుంచి అమలు చేయనుందని, ఆటో నడుపుతూ జీవనం సాగించే కార్మికుల ఉపాధికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు కె.షబ్బీర్, ఎం.గిరిబాబు, బి.సోమేశ్వర నాయుడు, శివ, అశోక్ నాయుడు, నరసింహులు, బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.



హెచ్ఐవిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఐఈసి క్యాంపియన్ ప్రసాద్ రెడ్డి ప్రధానోపాధ్యాయుడు సహకారంతో మంగళవారం హెచ్ఐవి/ఎయిడ్స్, సుఖ వ్యాధులు, డ్రగ్ డి- ఆడిక్షన్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతల బాయి మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. కార్యక్రమంలో మధుర వాణి, మల్లారెడ్డి, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, నులిపురుగుల నివారణపై అవగాహన

శిరివెళ్ల : మండలంలోని యర్రగుంట్ల గ్రామ పరిధిలో గల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన, నులిపురుగుల నివారణ చర్యలపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యర్రగుంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ వైద్యాధికారి అష్రఫ్ అలీ, సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా నులిపురుగుల నివారణ మాత్రల వినియోగం గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు పుస్తకం కొనడానికి డబ్బులు లేకపోతే లైబ్రరీల బాట పట్టేవారని, ప్రస్తుతం సాంకేతిక విప్లవం విద్యార్థులను లైబ్రరీ నుంచి దూరం చేసిందన్నారు. గ్రంథాలయ అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న మాట్లాడుతూ భారత దేశంలో అకాడమిక్ లైబ్రరీలతో పాటు పబ్లిక్ లైబ్రరీ లకు కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. విద్యార్థులకు కాంపిటీషన్స్ పుస్తకాలు , జనరల్ నాలెడ్జ్ స్టడీ మెటీరియల్స్, స్వంత నిధులతో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంకా విద్యార్థులకు ఏ పుస్తకం అడిగినా తెచ్చి ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగ మస్తాన్, గాయత్రి, డా.వెంకట సుబ్బయ్య, డా.జయచంద్ర, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగన్న

పాఠశాల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాఠశాల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓలు, డిప్యూటీ డీఈవోలు, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో జిల్లాస్థాయి స్కూలింగ్, బిల్డింగ్ బ్లాకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉన్నత స్థాయికి చేర్చాలన్నారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 100 శాతం మార్కులు సాధించే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిపోతుందని, టెక్నాలజీని ఉపయోగించుకొని విద్యాభివృద్ధి చెందే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం ప్రస్తుతం పాఠశాల విద్య ఎలా ఉంది. ఇందులో ఏమేమి సమస్యలున్నాయి, అధిగమించడానికి ఏమిచేయాలి, ఎలా చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుంది వంటి విషయాలను జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రెడ్డి, ఎంఈఓలు, డిప్యూటీ డీఈవోలు, మోడల్ స్కూల్ హెచ్ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ,సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



విద్యార్థినీలను అభినందిస్తున్న అనంత రామ సుబ్బారెడ్డి

వాలీబాల్ పోటీల్లో 'అనంత' విద్యార్థినిల ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 7న నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో ఆళ్లగడ్డ పట్టణంలోని అనంత జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఆసియా, రుక్సానా, స్వాతి పాల్గొనిప్రతిభ కనబరిచారు. ఈనెల 17, 18, 19వ తేదీలలో తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి విద్యార్థినిలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పిఎఐపై శిక్షణ కార్యక్రమం

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో రామసుబ్బయ్య మంగళవారం తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల, గ్రామస్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని సూచించారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే.. : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

దేశ భవిష్యత్తు నేటి యువతపై ఆధారపడి ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ యువత దినోత్సవం సందర్భంగా స్థానిక టీఎస్ ఫంక్షన్ హాల్ నందు విద్యార్థులతో ఆస్క్ అఖిల అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే అఖిల ప్రియ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్యం అందడం లేదని, గ్రామీణ ప్రాంతాలలో రవాణా సౌకర్యానికి రోడ్లు సరిగా లేవని, విద్యా వ్యవస్థలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించే దిశలో కృషి చేయాలని, నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని, అధికారులతో మాట్లాడతానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ రేపటి తరం హీరోలు యువకులేనన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి అటు కళాశాలకు ఇటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలో ఏ సమస్యనైనా యువత నా దష్టికి తీసుకుని వస్తే తప్పకుండా సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ మల్లేశ్వర్ రెడ్డి, ప్రజ్ఞా విద్యా సంస్థల కరస్పాండెంట్ హేమలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిలతో ఎమ్మెల్యే

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చాగలమర్రి

రైతులు పమ పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెం, గొడిగనూరు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో లోతట్టు పొలాలలో మొక్కజొన్న పంట సాగు చేస్తుంటే నీరు నిలవకుండా కాలువలు తీసుకొని నీటిని తీసివేయాలన్నారు. మినుము పంటలో అధిక తేమ వల్ల బూడిద తెగులు వచ్చే అవకాశం ఉన్నందున వాటి కోసం తీసుకోవలసిన సస్యరక్షణా చర్యల గురించి వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద పంట భీమా కొరకు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించుటకు ఈ నెల 14 తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నందున ప్రతి రైతు తమ ఆధార్ కార్డ్,పొలం పాసుపుస్తకం, పంట వేసినట్టు సంబంధిత రైతు సేవా కేంద్రం వారు జారి చేయు పంట నమోదు సర్టిఫికేట్ తీసుకోని మీ సేవా కేంద్రం నందు లేదా బ్యాంకు నందు చెల్లించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు ఉమ, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది సెప్టెంబర్ 5న జరుగు ఉపాధ్యాయ దినోత్సవం (గురు పూజోత్సవం) సందర్భంగా నిర్వహించనున్న 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2025' ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ జనార్దన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు కనీసం 10 సంవత్సరాల పూర్తి సేవ ఉన్నవారు ఏవిధమైన సివిల్, క్రిమినల్ కేసులు లేవని దవీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలన్నారు. గతంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందని వారే అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఎంఇఒ, ఉప విద్యాశాఖాధికారి కార్యాలయాలకు పంపాలని పేర్కొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానానికి గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన గంగుల శంకర్ రెడ్డి, సతీమణి క్రిష్ణవేణి, వారి కుమార్తె, అల్లుడు జశ్వంతి ప్రవీణ్ రెడ్డి, కుమారుడు దినేష్ రెడ్డి, కుటుంబ సభ్యులు రూ.1,00.116 విరాళాన్ని డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పివి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు మంగళవారం అందచేశారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - రుద్రవరం

చిన్నపిల్లల్లో నులిపురుగుల నివారణతో వారి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాబు, ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అమరనాథరెడ్డి, డాక్టర్ నాగశ్రీజా రెడ్డి, రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావణి తెలిపారు. మంగళవారం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు తినిపించారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో నరసాపురం ఆరోగ్య కేంద్రం పరిధిలో 1628 విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2835 మంది చిన్నారులకు, రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 43 15 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలఉపాధ్యాయ బందం, అంగన్వాడి టీచర్లు ఆయాలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** నులిపురుగుల నివారణతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కొలిమిగుండ్ల పిహెచ్సి డాక్టర్ హరి చరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ సరోజ అధ్యక్షతన డాక్టర్ హరి చరణ్ రెడ్డి జాతీయ నులి పురుగుల (నేషనల్ డీవార్మింగ్ డే) నివారణ దినం సందర్భంగా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం ఉమా మహేశ్వరి, ఆశ పరిమళ, కేజీబీవీ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే నులిపురుగులను నివారించడం అత్యంత ముఖ్యమని జిల్లా ప్రోగ్రామ్ అధికారి అంకిరెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని 10,11 అంగన్‌వాడీ కేంద్రాలు,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,కస్తూరిభా పాఠశాలలలో ఆల్బెండ జోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 9,104 విద్యార్థులు లక్ష్యం కాగా 8,740 మందికి ఈ మాత్రలు వేసామన్నారు. వైద్యులు ఇమ్రాన్, ఎంపీహెచ్ఈఓ శివరామయ్య, డిప్యూటి డివైహెచ్ఈఓ విజయ భారతి, సూపర్‌వైజర్ రాంలింగారెడ్డి,హెచ్ఏ మనోహర్, హెచ్ఎంలు, ఆరోగ ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చాగలమర్రిలో..


రుద్రవరంలో..


కొలిమిగుండ్లలో..



15న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లలిత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ తల సేమియా వ్యాధి కలిగిన 40 మంది చిన్నారులను కర్నూలులోని స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్నామన్నారు. ఆ పిల్లలకు ప్రతి 30 రోజులకు ఒకసారి రక్త మార్పిడి చెయ్యాలని, లేనిచో నీరసించి మరణించే అవకాశం ఉంటుందన్నారు. వారి కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవత్వంతో విద్యార్థులు, బనగానపల్లె యువకులు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేసే విద్యార్థి యువకులు వివరాలకు యం.రామన్న 9100988722, ఋషిశ్వరుడు 9642770981, ఆంజనేయులు 9704577941 నంబర్లను సంప్రదించాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- చాగలమర్రి

మండలంలోని చింతలచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. స్థానిక సచివాలయ వెల్ఫేర్ భార్గవ్, ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఈ నెల 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్న లక్ష్యాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో పిడి దాదా పీర్ ఏఎన్ఎం మాధవి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవాలి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంటలోని పెద్ద గ్రౌండ్ వద్ద ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద చెత్త నుండి సంపద సృష్టి కేంద్రంలో వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి వానపాములను 15 తొట్లలో వదిలినట్లు పంచాయతీ సిబ్బంది మంగళవారం తెలిపారు. దాదాపు 30 టన్నుల పేడ ఎరువు, తడి చెత్త నుండి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నామన్నారు. అక్టోబర్ 10వ తేదీ నాటికి 25 టన్నుల వర్మీ కంపోస్ట్ కేంద్రం వద్ద అమ్మడానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కేజీ రూ.10 చొప్పున రైతులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. వచ్చిన మొత్తాన్ని గ్రామపంచాయతీకి జమ చేస్తామన్నారు. చెత్తను రోడ్ల పై, కాలువలలో పారవేయకుండా గ్రామపంచాయతీ సిబ్బంది తెచ్చే రిక్షాలో, ట్రాక్టర్లో తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని తెలిపారు.

జడ్పిటిసి ఎన్నికలకు 300 పోలీస్ అదనపు బలగాలు

డిఐజి కోయ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో నిర్వహించనున్న జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం 300 మంది పోలీసులు బలగాలను కర్నూలు రేంజ్ నుంచి కేటాయించినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందులో కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లా నుంచి వంద మంది చొప్పున మొత్తం 300 మంది పోలీసులను కేటాయించామని తెలిపారు

పోరాడి ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు జేజేలు: డివైఎఫ్ఐ

పజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిరంతరం పోలీసు ఉద్యోగాల కోసం జరిగిన పోరాటంలో భాగస్వాములై ఉద్యోగం పొందిన అభ్యర్థులకు మంగళవారం బస్టాండ్ దగ్గర ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ సిఐ చంద్రహాస్ హాజరై మాట్లాడారు. నిరంతరం కష్టపడి కఠోర దీక్షతో చదువుకొని ప్రాక్టీస్ చేసి ఉద్యోగాలు పొందిన కానిస్టేబుల్ ఉద్యోగులను అభినందించారు. ఇప్పటిదాకా చదువుకుంటూ నిరుద్యోగి గాను విద్యార్థిగానో ఉన్న మీరు రాబోయే కాలంలో ఈ సొసైటీలో మంచి గుర్తింపుతో మెలగాలని కోరారు. గౌరవప్రదమైన శాంతిభద్రతలను కాపాడే వృత్తిని ఎన్నుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. సొసైటీలోని అసాంఘిక శక్తులను అణిచివేయడానికి కృషి చేయాలని కోరారు. రాబోయే కాలంలో ఇదే పట్టుదల కృషిని కొనసాగించి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేష్, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్‌లో కేవలం 450 కానిస్టేబుల్ ఉద్యోగాలు విడుదల చేస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేసి కేసులు సైతం ఎదుర్కొని 6100 ఉద్యోగాలకు పెరగడానికి నిరుద్యోగులు తరుపున డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం చేయడం వల్లే సాధ్యమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయడం కోర్టు కేసులను చూపించి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఫిజికల్ ఈవెంట్స్, మైన్స్ ఎగ్జామ్స్ కోసం కూడా భారీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అన్ని సందర్భాలలోనూ నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయడం వల్లే ఈరోజు కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. గ్రూప్ టు గ్రూప్ వన్ ఉద్యోగాలు 26 మాత్రమే ఉన్నాయని, ప్రభుత్వం ప్రకటిస్తే ఉద్యమించడం ద్వారానే 968 పోస్టులకు పెరిగాయని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పోరాటం చేసిన ఫలితంగానే డిఎస్‌సి పై మొదటి సంతకం పెట్టి 16,437 ఉద్యోగాలు కూడా పొందుతున్నారని తెలిపారు. ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగం, డ్రగ్స్ అంతం కోసం డివైఎఫ్ఐ చేసే పోరాటాల్లో యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమాజాన్ని ముఖ్యంగా భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నాలుగున్నర లక్షల మంది పరీక్షలు రాస్తే 6,100 మంది మాత్రమే కానిస్టేబుళ్లు అయ్యారంటే అందరికంటే ఎక్కువ ఫిజికల్ ఈవెంట్స్ కోసం మైన్స్ ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ కోసం కష్టపడి చదివి సాధన చేయడం వల్లే ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో నిరుద్యోగులందరూ పోరాటం చేసి కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యమాలను ఉధృతం చేద్దామని అన్నారు. అనంతరం నూతన పోలీస్ అభ్యర్థులకు శాలువా కప్పి మెమెంటోస్ ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అంజి, నాయకులు విశ్వనాథ్ సాయి రాము నగర ఉపాధ్యక్షులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ చంద్రహాస్

పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్ఎంయు జోనల్ అధ్యక్షులు ,సిసిఎన్ఎంసి మెంబర్ వినోద్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పి. మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకుగేట్ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు తక్షణమే పిఆర్‌సి కమిషన్ ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఎలను తక్షణమే చెల్లించాలని చెప్పారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు , టెర్మినల్ ఎన్క్యాష్మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఎనిమిది వేల పోస్టులను నేరుగా భర్తీ చేయాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగస్తుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఇహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగస్తులకు ఓడీలను కేటాయించాలన్నారు. రిటైర్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలకు అనుమతించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్ఆర్.నాయుడు, జిల్లా కార్యదర్శి పిఎండి ఇస్మాయిల్, రీజనల్ చైర్మన్ జి.రవీంద్ర బాబు, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ వలి, జోనల్ నాయకులు గౌస్.సత్యనారాయణ, కర్నూలు వన్ టూ డిపోల కార్యదర్శి ఎంఎస్‌బి రెడ్డి , జోనల్ రీజినల్ డివిజనల్ సిసిఎస్ ఢిల్లీ డిపోలలోని నాయకులు ఎన్ఎంయులోని సభ్యులు కార్మిక సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో నేను సైతం అంటూ ధర్నా , గేట్ మీటింగ్లలో పాల్గొని విజయవంతం చేశారు.

పంట సాగుదారు హక్కు పత్రాలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రైతులందరూ పంట సాగుదారు హక్కు పత్రాలు కలిగి ఉండాలని, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి ఈ పత్రాలు పొందాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. నంద్యాల మండల పరిధిలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాలలో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ప్రధాన పంటలో ఎరువులను మోతాదుకు మించి వాడరాదని, ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్ లను ఇచ్చే ఎరువులను వేసుకోవాలని తెలిపారు. నానో యూరియా, నానో డిఏపి ఎరువుల వాడుక వలన పర్యావరణ, భూమి కాలుష్యం తగ్గించి నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలియజేసారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాలలింగామయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది మౌనిక మరియు రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గం లోని ప్రతి ఎకరాకు సాగునీరు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని రైతులు ట్రాక్టర్, ఎద్దుల బండ్లతో అన్నదాత సుఖీభవ పథకానికి సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ సీఎం కెఇ.కష్ణమూర్తి హయాంలో హంద్రీనీవా కాలువ ద్వారా 68 చెరువులకు నీరు నింపిన ఘనత తమకే దక్కిందని అన్నారు. పందికోన రిజర్వాయర్ ఆయకట్టు పెంచాలని రూ.250 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అన్నారు. ఆగస్టు 15 మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర , వెంకటపతి, కడవలసుధాకర్, జూటూరు ఈశ్వరప్ప పాల్గొన్నారు..

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ 90వ సంవత్సరం ఫౌండేషన్ డే సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బాలకృష్ణ, సిపిఐ నాయకులు సంజీవులు ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. భారతదేశ బానిస సంఖ్యల విముక్తి కోసం పోరాడితే పోయేదేముందని, ఒత్తులతో పిడికిలెత్తి బిగించి భారతదేశ స్వాతంత్రం కోసం మా ప్రాణాలు సైతం లెక్కచేయమని భారతదేశాన్ని సుదీర్ఘంగా పరిపాలించిన బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి పోరాటం చేసినట్లు తెలిపారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన నాయకులు భగత్ సింగ్ ,రాజ్ గురు సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి ఎందరో వీరుల ప్రాణ త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. వారి ఆశ సాధన కోసం విద్యార్థులు యువత పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి, బనగానపల్లె మండల కార్యదర్శి ప్రశాంత్, మండల సహాయ కార్యదర్శి చందు,నాయకులు మనోజ్, మతేష్, రమేష్ ,షాషావలి మహేంద్ర, అర్జున్ ,జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజు అవయవ దానం ప్రాముఖ్యతను గుర్తుచేసుకోవడమే కాక, ప్రాణాలను రక్షించడానికి ముందుకు రావాలని ప్రజలకు ప్రేరణ ఇస్తుంది. అన్నారు మెడికవర్ హాస్పిటల్ లో పని చేస్తున్న నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్ధార్థ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...

అవయవ దానం అంటే ఏమిటి?

అవయవ దానం అనేది, ఒక వ్యక్తి తన మరణానంతరం లేదా బతికే ఉన్నప్పుడు (కొన్ని అవయవాలు మాత్రమే) ఇతరులకు అవసరమైన అవయవాలను ఇవ్వడం. దీని ద్వారా అనేక ప్రాణాలు కాపాడబడతాయి.

ఎవరు అవయవ దాతలుగా మారవచ్చు?

18 ఏళ్లు పైబడిన ఎవరైనా, ఆరోగ్యంగా ఉన్నవారు, మరణానంతరం అవయవాలను దానం చేయడానికి ముందుగా కుటుంబ సభ్యులకు తెలియజేయాలి.

దానం చేయగల అవయవాలు

హృదయం, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, కన్నులు (కార్నియా), పాంక్రియాస్

ఎందుకు ఇది ముఖ్యము?

ప్రతి సంవత్సరం వేలాది మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క దాత 8 మందికి పైగా ప్రాణాలను కాపాడగలడు.

మనం చేయాల్సింది

అవయవ దానం గురించి అవగాహన పెంచుకోవాలి. దానం చేయాలనే సంకల్పాన్ని కుటుంబంతో పంచుకోవాలి. అవయవ దానానికి రిజిస్టర్ కావాలి.

సంక్షిప్తంగా

అవయవ దానం అంటే ప్రాణదానం. మన మరణానంతరం కూడా ఎవరికో కొత్త జీవితం ఇవ్వగల అత్యంత గొప్ప కానుక ఇది. మనం ముందుకు వస్తే, అనేక కుటుంబాలు ఆనందాన్ని తిరిగి పొందుతాయి.

పిల్లల ఆరోగ్యానికి రక్షా కవచం అల్బెండజోల్

జాతీయ నులిపురుగుల దినోత్సవంలో పిడి పి. విజయ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



పిల్లల్ని పట్టి పీడించే అనారోగ్య సమస్యల్లో నులి పురుగులు ప్రధానమైనవని, వీటిని ఎదుర్కోవడంలో ఆల్బెండజోల్ రక్షణ కవచంగా ఉపయోగపడుతున్నదని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.విజయ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం లో భాగంగా కర్నూలు పట్టణంలోని బుధవార పేట – 4 అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆమె చేతుల మీదగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగులు పిల్లల ఎదుగుదలను శాసిస్తున్నాయనీ, క్రమంగా రక్తహీనత, పోషకాహార లోపం, బరువు పెరగకపోవడం, జీర్ణక్రియ మందగించటం, అలసట లాంటి లక్షణాలు తరచుగా పిల్లల్లో కనిపిస్తే నులిపురుగులే కారణమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము ధూళి మట్టిలో పిల్లలు ఆడకుండా చూడటం, బహిరంగ మలవిసర్జనను నిషేధించటం, చేతి గోళ్ళను శుభ్రంగా ఉంచుకోవడం, భోజనం ముందు, మలవిసర్జన తర్వాత చేతుల్ని సబ్బుతో కడగడం ద్వారా నులి పురుగులను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణలో ఆల్బెండజోల్ ఒక శక్తివంతమైన, బహుముఖ ఔషధంగా ఉందని,1–2 సంవత్సరాల లోపు పిల్లలకు అరమాత్ర, 3–19 సంవత్సరాల లోపు పిల్లలకు 400 ఎంజి పూర్తి టాబ్లెట్‌ను వేయాలన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1886 అంగన్వాడీ కేంద్రాల్లో 62,000 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. చిన్నారుల రక్షణకు ఐసిడిఎస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రాజెక్ట్ సిడిపిఒ అనురాధ, గ్రేడ్ – 1సూపర్వైజర్ నజ్మా , ఎఎన్ఎం ఉమా, అంగన్వాడి వర్కర్లు , హెల్పర్లు, ఆశా వర్కర్లు , తల్లులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెల్దుర్తి సిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన డిసిహెచ్

ప్రజాశక్తి - వెల్దుర్తి



వెల్దుర్తి సిహెచ్‌సిని మంగళవారం డిసిహెచ్ (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్) కర్నూలు డాక్టర్ జఫ్రుల్లా ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డులలో తిరిగి అడ్మిషన్‌లో ఉన్న రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. బాలచంద్రారెడ్డి, వైద్యులు, వైద్యసిబ్బందితో ఆయన సమావేశం అయి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిసిహెచ్ పాత్రికేయులతో మాట్లాడుతూ వెల్దుర్తి (సిహెచ్సి) 30 పడకల ఆసుపత్రిలో అన్నిరకాల మౌలికవసతులు ఉన్నాయన్నారు. ఇక్కడ 31మంది వైద్యసిబ్బంది ఉన్నారన్నారు. ఫార్మసి, జిడిఎం, ల్యాబ్ హెడ్ నర్సు పోస్టుల ఖాళీ ఉందన్నారు. త్వరలోనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ 30పడకల ఆసుపత్రైనా 60 పడకల సామర్థ్యంతో వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. పెద్ద ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. గుండెపోటుకు సంబంధించి రూ.40 వేల ఇంజక్షన్ ను ఉచితంగా ఇస్తున్నామన్నారు. ప్రతినెల తాను వైద్యులతో రివ్యూ నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించేలా ముఖ ఆధారిత హాజరుతో ఉండేలా పర్యవేక్షణ ఉంటుందన్నారు. మందులను బయటకు రాస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఎఫ్ నిధుల నుంచి ఆసుపత్రికి అవసరమైన వస్తువులు తీసుకోవాలన్నారు. ఎక్స్‌రే సేవలు సైతం త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. ఇటీవల వెల్దుర్తి మండలంలో డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు పెరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటికి సంబంధించిన వైద్యపరీక్షల కిట్లను నిహెచ్‌సిలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రోగులను రెఫరల్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీలు

-ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన ఇండస్ పాఠశాల క్రీడాకారులు

-రెండవ స్థానంలో కేశవరెడ్డి పాఠశాల

- మూడో స్థానంలో ఆదోని క్రీడాకారులు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్



కర్నూలు జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన కర్నూలు జిల్లా స్థాయి యోగా పోటీలు మంగళవారంతో ముగిసినట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు అవినాష్ శెట్టి,ముని స్వామి తెలిపారు.ఈ పోటీలలో 65 పాయింట్లతో ఇండస్ పాఠశాల క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకోగా, 60 పాయింట్లుతో వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల, 50 పాయింట్స్ తో మూడో స్థానంలో ఆదోని క్రీడాకారులు నిలిచినట్లు వారు తెలిపారు. అవుట్డోర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధానోత్సవానికి యోగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, ఛాంపియన్షిప్ డైరెక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి రాష్ట్రస్థాయి పోటీల్లో క్రమశిక్షణతో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా యోగ సంఘం సభ్యులు లోకేష్, శేషఫణి, అక్బర్, కేశవ, విశ్వతేజ, పద్మలత, లలనప్రియ పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ఎఇఒ భోజరాజు

ప్రజాశక్తి-మద్దికేర

ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం, పోషక విలువలు కూడిన ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ అధికారి భోజరాజు అన్నారు. మండల కేంద్రమైన మద్దికేర తహశీల్దార్ ఆఫీసులో ప్రకృతి వ్యవసాయం స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తులు అందించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతం పెరిగి అధిక పంట దిగుబడికి ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు అధిక మొత్తంలో క్రిమిసంహారక మందులు వినియోగించడం వల్ల భూమి సారం కోల్పోతుందన్నారు. విషాహార ఉత్పత్తులు ప్రజలకు అందించి వారి అనారోగ్యానికి కారకులవుతున్నామని తెలిపారు. పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు పండించిన ఉత్పత్తులు ఎక్కువ మొత్తం చెల్లించి తమ రైతు కంపెనీల ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోప్రకృతి వ్యవసాయ సిబ్బంది భీమరాజు, ప్రసాదు, సలీమా తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి డిఎం రిజిస్ట్రార్ గా రాజ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



నగర శివార లోని స్థానిక జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ట్రిపుల్ ఐటి డిఎం రిజిస్ట్రార్ గా రాజ్‌కుమార్ మాంఝివాల్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆయన జనవరి 2023 నుండి ఆగస్టు 2025 వరకు జైపూర్‌లోని మాలవ్య నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. గతంలో ఐఐటి జమ్మూ మరియు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లలో కీలక పదవులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు



ఘనంగాఎస్ఆర్ రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎస్ ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ కె .ప్రకాష్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రకాష్ మాట్లాడుతూ ఎస్ఆర్ రంగనాథన్ 1892 ఆగస్టు 12న జన్మించారన్నారు. వారు గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులలో ఒక ముఖ్యులుగా ఈయన పుట్టినరోజున గ్రంథాలయాధికారుల దినోత్సవం జరుపుకొనడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆయన గణితం పట్ల ఎక్కువ మక్కువ కల వారిని, లైబ్రరీ కోర్సు పుస్తకాల అరేంజ్‌మెంట్ గురించి , గ్రంథాలయ పంచ సూత్రాలు రాశారు. వారు గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్ర గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపించారన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి ,ఎస్.బాషా, ఆఫీసు సిబ్బంది మగ్బుల్ బాష ,రాజు ,సుదర్శన్ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మురుగు కాలువలను పటిష్టం చేస్తాం

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో మురుగు కాలువలను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. మంగళవారం అధికారులతో కలిసి ఆవదూడ వంకను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయితే 150 మంది మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చాలా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరిందని, అనేక ఇళ్లల్లో ఆహార ధాన్యాలు తడిసిపోయాయని చెప్పారు. ఈనెలంతా వర్షాలు ఉన్నాయని, ఏ సమయంలోనైనా మళ్లీ వర్షాలు రావచ్చని తెలిపారు. మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్తగా అన్ని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇళ్లలోకి నీరు చేరి ధాన్యం తడిసి పస్తులున్నామని, ఎవరూ పట్టించుకోలేదని ఓ మహిళ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎంఇ సత్యనారాయణ, డిఇలు చలపతి, రామ్మూర్తి పాల్గొన్నారు.

డ్రెయినేజీ, రోడ్ల సమస్య పరిష్కరించాలి

- సిఐటియు, డివైఎఫ్ఐ నిరసన



నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి దేవనకొండ

దేవనకొండ ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. మంగళవారం సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు కాలనీలో పర్యటించి సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అశోక్, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, శ్రీనివాసులు మాట్లాడారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, సిసి రోడ్లు లేక రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోందని, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. సిఐటియు, డివైఎఫ్ నాయకులు చిన్న, వీరేందర్ నాయుడు, మురళీ, హనుమంతు, చిన్న, రవి కృష్ణ, రవితేజ, రాము, సూరి, వేణు, గోవర్ధన పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆలూరు

ప్రభుత్వ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాసీం కోరారు. మంగళవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర ఆడిట్ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్‌టిఎఫ్ఐ 25 ఏళ్లలో జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల సమస్యలపై వివిధ స్థాయిల్లో ప్రదర్శనలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి సురేష్ బాబు, మండల అధ్యక్షులు బసవరాజు, మంగయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, యాగంటప్ప, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోవిందప్ప పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న నాయకులు

భౌతిక దాడి సమంజసం కాదు

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

తప్పు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయాలే తప్ప భౌతిక దాడి చేయడం చట్టరీత్యా నేరమని, పోలీసులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. మంగళవారం బాధితుడు రమేష్, ప్రజాసంఘాల నాయకులతో కలిసి డీఎస్పీ హేమాలతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రమేష్‌ను గతనెల 30న రాత్రి పట్టణంలోని వన్‌టౌన్ పోలీసులు వాహనంలో తీసుకెళ్లారన్నారు. కంట్రోల్ రూమ్, వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో రమేష్‌ను వాహనంలో తిప్పి స్టేషన్‌లో కాళ్ల పాదాలు, వీపు, కాళ్లు, పిరుదులు, చేతులపై లాఠీలతో కొట్టి చిత్రహింసలు పెట్టారని తెలిపారు. అరెస్ట్ చేస్తే 24 గంటల్లోపు కోర్టులో హాజరు పరచకుండా రమేష్‌ను పోలీసులు ఇబ్బందులకు గురిచేసి మానవ హక్కులను హరించారని మండిపడ్డారు. బాధితుడు రమేష్ మాట్లాడుతూ... సివిల్ పంచాయితీ విషయంలో మాట వినలేదని పోలీసు అధికారి తనను చిత్రహింసలకు గురి చేశారని, ఆయన నుంచి ప్రాణహాని ఉందని వాపోయారు. పోలీస్ దెబ్బల వల్ల ఆరోగ్యం క్షీణించిందని, న్యాయం చేయాలని కోరారు. అంతకుముందు జెబి గార్డెన్‌లో కులసంఘాల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు రంగన్న, నరసన్న, బొబ్బిలి లక్ష్మీనారాయణ, సుజ్ఞానమ్మ, ప్రసాద్, మహానంది, సాయిరాం, గోపాల్, లక్ష్మణ్, కామాక్షి తిమ్మప్ప, గిరి, దస్తగిరి నాయుడు, వెంకటేష్, కోదండ, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బాధితుడు రమేష్‌తో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాసులు

పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

వేతన సవరణ ముగిసి ఇప్పటికీ రెండేళ్లయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షులు బసవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని ఆర్‌టిసి డిపో ముందు జెండాలు చేతబూని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న 8 వేల ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, ఆర్‌టిసి ఆస్తులను పరిరక్షించాలని తెలిపారు. డిపో కార్యదర్శి టి.రామలింగప్ప, గ్యారేజీ అధ్యక్షులు ఎజాజ్, కార్యదర్శి ఎం.షరీఫ్. ఖాజా, ఉద్యోగులు హుస్సేన్, ఎర్రిస్వామి, పంపన్న, త్యాగరాజు, హనుమంతు, ధనుంజయ, మల్లికార్జున, చాంద్ బాష పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఉద్యోగులు



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పెండింగ్ జీతాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఆలూరు

పంచాయతీ కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు షాకీర్ కోరారు. మంగళవారం ఆలూరు పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షాకీర్ మాట్లాడారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేసి ప్రజారోగ్యాన్ని కాపాడే పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడి పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు విఠల్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి ఎల్లప్ప, కార్మికులు పాల్గొన్నారు.

బాబు మోసాలను గుర్తిస్తున్న ప్రజలు

- వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాత్రికి, లింగాల దిన్నె, అగసలదిన్నె, దోమలదిన్నె, బాపురం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' నిర్వహించారు. వెంకట్రామిరెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, చెన్నప్ప, గురునాథ్ రెడ్డి, శ్రీకాంత్, వీరభద్ర గౌడ్, నాగభూషణ్ గౌడ్, మారెప్ప, సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి, మహేష్, అనిల్, బసప్ప గౌడ్, గోపాల్ రెడ్డి, రామస్వామి, అబ్దుల్ సమద్, హుసేని, మూకన్న, లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సమయపాలన పాటించని
సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

- రైతు సంఘం సహాయ కార్యదర్శి సూరి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ సచివాలయం ముందు రైతు సంఘం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు 11 గంటలైనా విధులకు హాజరు కావడం లేదని తెలిపారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, సచివాలయ సిబ్బంది సరైన సమయానికి విధులకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్, మల్లి, నాయుడు, సురేష్, రైతు సంఘం నాయకులు కౌలుట్లయ్య, బసప్ప, రాజు పాల్గొన్నారు.



సచివాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

ఖరీఫ్ పంటలను నమోదు చేయించుకోవాలి

- ఎఒ శ్రీరామ్ ప్రవీణ్



ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసుకున్న ప్రతి రైతూ ఈ-క్రాప్ యాప్‌లో పంట నమోదు చేయించుకోవాలని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ పట్టాదారు పాసుపుస్తకం, వన్ బి అడంగల్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకప్ అయిన బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు అందజేసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు పైన పేర్కొన్న జిరాక్స్ కాపీలతో పాటు సిసిఆర్‌సి కార్డు తప్పనిసరిగా జత చేయాలన్నారు. నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. ఎక్కువ వర్షాలు కురిసి పంటలు దెబ్బ తిన్నప్పుడు ఈ-క్రాప్‌లో నమోదు ఉంటేనే ప్రభుత్వం అందించే పరిహారం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఇఒ రమాదేవి పాల్గొన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారం పట్ల హర్షం



కేక్ కట్ చేసి వేడుక నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆశావర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతిస్తూ ఆశావర్కర్లు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోరాటాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి గ్రంథాలయంలో ఎస్ఆర్.రంగనాథన్ జయంతిని గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రంథాలయ కార్యాలయంలో ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... రంగనాథన్ 1892 ఆగస్టు 12న జన్మించారని, గణితం పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్న వ్యక్తి అని తెలిపారు.

ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ నాయకులు పంపన్న హాజరయ్యారు. ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు హాజీ బాబా వలీ, ప్రహ్లాద్, భీమశంకర్, వీరేష్, సూరి, లోకేష్, రవి పాల్గొన్నారు.

ఇండియా కూటమి నాయకుల అరెస్టు సిగ్గుచేటు

ప్రజాశక్తి - కొత్తపల్లి : ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎలక్షన్ కమిషన్ చేసిన తప్పులను సాక్షాధారాలతో చూపిస్తూ.. ఢిల్లీలో సోమవారం ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం అమానుషమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కును బిజెపి ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. ఒకే వ్యక్తి ఒకే ఓటు అనే నినాదంతో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి యావత్ భారతీయులందరూ మద్దతు పలకడంతో బిజెపి ప్రభుత్వం ఓర్వలేక అక్రమ అరెస్టు చేసిందన్నారు. దేశంలో జరిగే తప్పులను ప్రశ్నించే నాయకులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని నంద్యాల జిల్లా కార్యదర్శి ఎం సికిందర్, కొత్తపల్లి మండల అధ్యక్షులు అతావుల్లా, ఉపాధ్యక్షులు నాగన్న, మైనార్టీ అధ్యక్షులు శాలి పైల్వాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నందిపల్లెలో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - మహానంది : నందిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోందిలో భాగంగా ఎంఎఒ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణలో నంద్యాల ఏడిఏ చెన్నయ్య మాట్లాడారు. రైతులు వరి పంటలో ఖర్చు తగ్గించుకొని నికర ఆదాయం పెంచుకోవాలని సూచించారు. విచక్షణారహితంగా యూరియా, ఎరువులు వాడరాదని, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణ కాలుష్యాన్ని కాపాడాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. రైతులు సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు.

నూతన ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బరాయుడు స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఆసక్తి గలవారు 20 రోజుల్లోపు కార్యాలయ పని వేళల్లో ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

- ఎఒకు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - ఆస్పరి


రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని రైతుసంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఎఒ నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా కొరత లేకుండా రైతులకు సరి పడే బస్తాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రయివేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అధిక ధరకు బయో మందులు, ఎరువులు ఇస్తూ రైతులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యకాస మండల నాయకులు వెంకట రాముడు, రాముడు, రైతులు మల్లయ్య, శీను, రవి, కృష్ణ, ఈరన్న, చలపతి, బద్రి, ప్రకాష్, తిప్పన్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- వాహన మిత్ర పథకం కింద ఏడాదికి ఒక్కో కార్మికునికి రూ. 25వేలు ఇవ్వాలి
- సిఐటియు, ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్




ప్రజాశక్తి - బేతంచెర్ల : ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య కోరారు. పట్టణంలోని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు నిరసన చేపట్టారు. సిఐటియు నాయకులు ఎల్లయ్య, రామాంజనేయులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల్లేక ప్రయివేటు ఫైనాన్సియర్స్ వద్ద, బ్యాంకుల్లో లోన్లు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఉచిత ప్రయాణ బస్సులే వస్తే కార్మికులు ఉపాధి కోల్పోతారని, కార్మికులు ప్రతినెల ఇఎంఐలు కట్టుకునేందుకు, పిల్లలి చదువులకు, కుటుంబాల పోషణకు ఒక్కో కార్మికునికి ఏడాదికి రూ. 25వేల ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి. వేణుగోపాల్, మద్దిలేటి స్వామి, సంజీవ, వెంకటరమణ, ఆటో వర్కర్స్ కార్మికులు తిరుమల్, మద్దయ్య, కుళాయి, వెంకటేశ్వర్లు, విశ్వనాథం, ఫక్రుద్దీన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం : వ్యకాస

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ఇసుక వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పూర్తి చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కర్ణ తెలిపారు. జూపాడుబంగ్లా మండలం పారుమంచల గ్రామంలోని ఇసుక వాగును ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఇసుక వాగు బ్రిడ్జి పనులు మొదలుపెట్టి దాదాపు మూడేళ్లు అవుతున్నా పూర్తి చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రజలు, బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో కాకిలేరు వాగు, నల్లవాగు, ఇసుక వాగులో నీళ్లు చేరి మొక్కజొన్న, పత్తి తదితర పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ప్రజలకు, విద్యార్థులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. లేని ఎడల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బ్రిడ్జిని పరిశీలించిన వారిలో నాయకులు లక్ష్మన్న, రాముడు, అల్లా బకాష్, బాష ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

- ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం



ప్రజాశక్తి - ఆత్మకూరు

బైర్లుటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 1-19ఏళ్ల పిల్లలందరికీ వైద్యాధి కారులు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. నులిపురుగులతో రక్తహీనత ఏర్పడుతుందని, కడుపు నొప్పి వస్తుందని తెలిపారు. దీనిని నివారించడానికి ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు భోజనం తరువాత, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, వాటిపై మూతలు మూయడం మర్చిపోవద్దన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 6,099 గాను 5907 విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు సూపర్వైజర్ రావణమ్మ, భ్రమరాంబలు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కుద్దుస్‌బాష, ఎంపిహెచ్ఎస్ మధు, సిహెచ్ఒ ఏఎన్ఎం ఆశా, అంగన్వాడీ టీచర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : పిల్లల ఎదుగుదలకు వారి కడుపులోని నులిపురుగులు అవరోధంగా పని చేస్తాయని బండి ఆత్మకూరు పిహెచ్సి డాక్టర్ భావన తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఆమె తెలిపారు. మొత్తం 7,767 మంది బాలబాలికలకు గానూ 6,882 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు.

మహానంది : నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యకరంగా ఉంటారని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గాజులపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 1-19ఏళ్ల పిల్లలందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, సిహెచ్ఒ నాగమల్లేశ్వరి, సూపర్వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ రమాదేవి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని కులుమాల గ్రామంలో ఎల్‌డిసి, కెవైఆర్‌డి సంస్థల ఆధ్వర్యంలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌డిసి ప్రతినిధి ఉపేంద్రరెడ్డి, కెవైఆర్‌డి ప్రతినిధి మధుసూదన్, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో రైతులు అత్యధికంగా పత్తి పంటను సాగు చేశారని, పత్తిలో గులాబీ పురుగు ఆశిస్తున్నందున చేపట్టాల్సిన యాజమాన్య చర్యలపై రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు. లింగాకర్షక బుట్టలను అమర్చడం, గడ్డిపూలను ఏరివేయడం, పురుగుమందుల పిచికారి ఉదయం 7 నుంచి 10 గంటల మధ్యలో పూర్తి చేయాలని సూచించారు.

గుండెపోటుతో బిఎఫ్‌టి గాదెప్ప మృతి

ప్రజాశక్తి - ఆలూరు



నివాళులర్పిస్తున్న సిబ్బంది



మండలంలోని ఉపాధి చట్టంలో విధులు నిర్వహించే బేర్ ఫూట్ టెక్నిషియన్ గాదెప్ప (53) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు... తన స్వగ్రామమైన ముసానహళ్లిలో ఉదయం 8 గంటల సమయంలో గ్రామస్తులతో మాట్లాడి ఇంటికి వెళ్లారు. ఆయన భార్య జి.లక్ష్మి గ్రామంలోని పోస్టాఫీస్‌కు వెళ్తొస్తానని చెప్పి వెళ్లి వచ్చేలోపు మంచంపైనే మృతి చెందారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏపీడీ పక్కీరప్ప, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది గాదెప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుంటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించి సానుభూతి తెలిపారు.

ఈరన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,33,56,261 వచ్చిందని దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. మంగళవారం ఆరు రోజుల హుండీని లెక్కించారు. స్వామివారికి ఈ నగదుతో పాటు బంగారం 3 గ్రాముల 400 మిల్లీ గ్రాములు, వెండి 32 కిలోల 700 గ్రాములు భక్తులు సమర్పించుకున్నట్లు వాణి తెలిపారు. హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.